క్లుప్తంగా

బై బై.. గణేశా !



ప్రత్తిపాడు: గణనాథుని నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ప్రత్తిపాడు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్ల రామాలయం వద్ద తొమ్మిది రోజుల పాటు మండపంలో విశేష పూజలు అందుకున్న లంబోదరుడు శనివారం ఘనంగా నిమజ్జనానికి తరలివెళ్లాడు. కమిటీ ఆధ్వర్యంలో తొలుత పెద్దఎత్తున నిర్వహించిన అన్నదానంలో భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన నిమజ్జనోత్సవంలో మేళ తాళాలు, కనకతప్పెట్ల మోతలతో గంగ ఒడికి గౌరీ తనయుడు తరలాడు. యువతీ, యువకుల నృత్యాలు హైలెట్‌గా నిలిచాయి. మహిళల కోలాట నృత్య ప్రదర్శన అలరించింది.

చైల్డ్ ట్రాఫికింగ్‌పై అవగాహన అవసరం



గుంటూరు రూరల్: చైల్డ్, మెన్ ట్రాఫికింగ్‌పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ బేబీరాణి తెలిపారు. నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చైల్డ్ ట్రాఫికింగ్, పోక్సో చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ ట్రాఫికింగ్‌కు పాల్పడే వారు అనేక మాయమాటలు చెబుతారని, వాటిని వినవద్దని సూచించారు. అపరిచితుల వెంట బయటకు వెళ్ల రాదని చెప్పారు. వరకట్నం వేధింపులు, చట్టాల గురించి వివరించారు. చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధులు స్వర్ణలత, పద్మజ, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు జి.పాప, చంద్రికా రాణి, సుధారాణి, వెంకటరావు, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే స్వచ్ఛత

పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఆదేశాల మేరకు పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్యకుమారి, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జడ్జి సత్యకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు, ఉద్యోగులు తమ కార్యాలయాల ఆవరణను శుభ్రపరచిన ప్పుడే స్వచ్ఛత నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. వర్ధన్, షేక్ బాజీ సాహెబ్, న్యాయవాద గుమస్తాలు రామారావు, హేమంత్, శ్రీను, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెదకాకాని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా చాగంటి



పెదకాకాని: వైఎస్సార్ సీపీ పెదకాకాని మండల అధ్యక్షునిగా వెనిగండ్ల గ్రామానికి చెందిన చాగంటి మురళీమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మురళీమోహన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి పార్టీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని తెలిపారు.

ఎన్‌ఈపీ సారథులుగా వీవీఐటీ విద్యార్థులు



పెదకాకాని: జాతీయ విద్యా విధానం 2020 అమలులో విద్యార్థుల్ని భాగస్వామ్యం చేసే లక్ష్యంతో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు చేసిన ఎన్‌ఈపీ (నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ) సారథి కార్యక్రమంలో బ్రాండ్ అంబాసిడర్లుగా వీవీఐటీ విద్యార్థులు మామిళ్ల మాధురి, రావుల రాజీవ్ చౌదరి, సంగు వెంకట ప్రశాంత్‌రెడ్డి ఎంపికయ్యారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది ఉన్నత విద్యాసంస్థల నుంచి 23 మందికి మాత్రమే ఈ అవకాశం రాగా, వారిలో ముగ్గురు వీవీఐటీ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎన్‌ఈపీ లక్ష్యాల్ని మరింత సులభతరం చేసేందుకు, విద్యా సంస్కరణలు విజయవంతంగా అమలు చేసేందుకు గాను ఎన్‌ఈపీ సారథులు తోడ్పడతారన్నారు. విద్యాసంస్థల్లో సదస్సులు, చర్చలు, పోటీలు నిర్వహించడం, సోషల్ మీడియా ద్వారా ప్రచారం, హెల్ప్‌డెస్కుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చైర్మన్ తెలిపారు. అనంతరం ఎన్‌ఈపీ సారథులుగా ఎంపికైన విద్యార్థుల్ని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్. కుమారస్వామి, అధ్యాపకులు అభినందించారు.

ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ బి. లక్ష్మానాయక్



పాతమల్లాయపాలెంలో మాట్లాడుతున్న లక్ష్మానాయక్, వేదికపై సర్పంచ్ పద్మావతి, వైద్యాధికారులు



శిబిరానికి హాజరైన రోగులు, వృద్ధులు



కొండపాటూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకట్



పెదనందిపాడులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా లైపసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ భూక్యా లక్ష్మానాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మానాయక్ గ్రామ సర్పంచ్ కాసు పద్మావతి, కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులతో కలసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. హాజరైన 320 మందికి పైగా రోగులకు వైద్యాధికారులు డాక్టర్ ముకేష్‌కుమార్, సుజిత, అంజనాదేవి, ఆర్. దివ్యమేఘన ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల్ని అందజేశారు. లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం మొత్తం ఐదు దశల్లో జరుగుతుందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందుల్ని అందించడంతో పాటు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సమస్యలున్న వారికి కళ్లద్దాలు ఇస్తామని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ , వైఎస్సార్ ఆరోగ్య ఆసరాపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి అనుసంధానం చేయడం వంటివి ఆరోగ్య సిబ్బంది చేస్తారని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వారికి స్పెషలిస్టు వైద్యుల సేవల్ని వారి గుమ్మం వద్దకు వచ్చి అందించే విధంగా కార్యక్రమానికి రూపకల్పన చేశారని వివరించారు. గొట్టిపాడు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి, ఉచిత వైద్య పరీక్షలు, టోకెన్లు జారీ చేస్తున్నట్లు చెప్పారు. హెల్త్ క్యాంప్‌లపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ జేఈఈవో ఆకస్మిక తనిఖీ

శిబిరాన్ని ఆరోగ్యశ్రీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. సుజాత ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల్ని పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రోగులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. తొలుత జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్. కేశవరెడ్డి, ఎంపీడీవో ఏ. శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మావులూరి మోషె పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కాసు పద్మావతి, కుందూరి లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మా రమాదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ రవికిశోర్, డాక్టర్ స్రవంతి, గ్రామస్తులు కాసు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు దాసరి చెంచు రామారావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యానికి భరోసా

కొండపాటూరు(కాకుమాను): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. మండలంలోని కొండపాటూరులో శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమారి మాట్లాడుతూ 45 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వమే 14 రకాల పరీక్షలు, 172 రకాల మందులతో ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు నెప్పల సౌజన్య, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో కెనడీ, ప్రత్యేక వైద్యులు వెంకట్, చందన, కంటి వెలుగు డాక్టర్ రాములు, రవి ప్రసాద్, యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదనందిపాడులో 423 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని మండల ప్రత్యేక అధికారి బి. మనోరంజని తెలిపారు. పెదనందిపాడులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 423 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోగ్రాం మానిటరింగ్ అధికారి బి. లక్ష్మణనాయక్, మండల అభివృద్ధి అధికారి రాజగోపాల్, తహసీల్దార్ సుభాని, మండల విద్యాధికారి బాలసుబ్రహ్మణ్యం, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ చేరువ చేయాలి

గుంటూరు రూరల్: నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష సమావేశాన్ని మండల అభివృద్ధి అధికారి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్. వజ్రశ్రీ పాల్గొన్నారు. వైద్య సేవలు, రోగులకు కల్పించే వసతులు, ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాల్ని నిర్వహించి కార్యక్రమాన్ని ప్రతి కుటుంబానికీ చేరువ చేయాలని చెప్పారు. ఆరోగ్య భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, ఎంఆర్‌వోలు, ఈవోపీఆర్డీ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శనివారం పట్టణంలోని 23వ వార్డు ఇందిరా నగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో, మండలంలోని వెల్లలూరు గ్రామ జెడ్పీ హెచ్ స్కూలులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరాల్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఇందిరాకాలనీలో సభకు కమిషనర్ నయీం అహ్మద్ అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే మన జగనన్న ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ సీఎం జగన్ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, ఎంపీడీవో ఎ. శ్రీనివాసరావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో..

గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యల్ని క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా క్యాంప్‌లో స్పెషలిస్ట్ వైద్యులు రోగుల్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతా రాణి, తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివ రావు, ఎంపీటీసీ సభ్యుడు ఆదాం, వైద్యాధికారి అబ్రహం లింకన్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవల్ని సద్వినియోగం చేసుకోవాలి



కొప్పురావూరులో వైద్య సేవలను పరిశీలిస్తున్న నేతలు

పెదకాకాని: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి తెలిపారు. మండలంలోని కొప్పురావూరు జెడ్పీహెచ్ స్కూలులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు పాల్గొన్నారు. శిబిరంలో అందిస్తున్న సేవల్ని పరిశీలించారు. శిబిరంలో 325 మందికి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏర్పాట్లను వెనిగండ్ల పీహెచ్‌సీ మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గజ్జల శ్రీనివాసరావు, క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ వరప్రసాద్ పర్యవేక్షించారు.

■ కంటి వైద్య శిబిరంలో డాక్టర్ రామాంజిరెడ్డి, డాక్టర్ పి. ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్య సేవలు అందించారు.

వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహమ్మద్, నాయకులు

పొన్నూరు: వైఎస్సార్ సీపీ పొన్నూరు పట్టణ అధ్యక్షుడిగా ఎండీ. మహమ్మద్ నియామక నేపథ్యంలో పట్టణంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా వెలుగులతో బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాగింది. ఈ సందర్భంగా మహమ్మద్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు షేక్ సైపుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



పెదకాకాని: స్థానిక శివాలయం ప్రహరీ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన జరిగింది. అర్చక స్వాములు, వేద పండితుల ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు, పాలకవర్గం సభ్యుల చేతుల మీదుగా ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవస్థానం పడమర వైపున గోడ శిథిలావస్థకు చేసి కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతితో రూ. 25 లక్షలతో పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న పోషకాహార ప్రదర్శన

ప్రత్తిపాడు: తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అడిషనల్ సీడీపీవో సీహెచ్. విజయనిర్మల తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ప్రత్తిపాడు మండల పాత మల్లాయపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు కచ్చితంగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. తొలుత పోషకాహార ప్రదర్శనను ఎంపీడీవో ఏ. శ్రీరమ్య, ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ హెల్త్ మేళాకు స్పందన



కార్డులను అందజేస్తున్న హర్ష మంగళ

వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్లలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య, సంరక్షణ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన మెగా హెల్త్ మేళాకు విశేష స్పందన లభించింది. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష మంగళ క్షేత్రస్థాయిలో ఆయుష్మాన్‌భవ పనితీరును పర్యవేక్షించారు. వేజండ్ల-2 గ్రామ సచివాలయ ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆయుష్మాన్ భవ కార్డులు, ఆర్గాన్ డోనర్స్ సర్టిఫికెట్లు, ఆరోగ్య పోషణ కిట్లను హర్ష మంగళ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబూరావు పాల్గొన్నారు.

హర్ ఘర్ జల్ గ్రామంగా కొండజాగర్లమూడి



సెక్రటరీ శివాజీకి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ప్రాజెక్టు జిల్లా మేనేజర్ కిరణ్‌కుమార్

కొండజాగర్లమూడి (ప్రత్తిపాడు): తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని కొండజాగర్లమూడిని హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించినట్లు జలజీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామసభను నిర్వహించారు. కొండజాగర్లమూడి గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా డిక్లేర్ చేశారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి శివాజీకి అందజేశారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ లక్ష్యాల్ని ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్ ప్రజలకు వివరించారు. ప్రాజెక్టులో భాగంగా ప్రతి వ్యక్తికి 55 లీటర్ల మంచి నీటితో పాటు సురక్షిత మంచినీటిని అందించడమే పథక ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హేమామి, జిల్లా కో-ఆర్డినేటర్లు వి. లక్ష్మణ్, పి. తేజ్ సంగీత్, నాగేశ్వరరావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మానసిక స్థైర్యంతోనే ధృఢమైన నిర్ణయాలు

ప్రత్తిపాడు: మానసిక స్థైర్యంతో బాలలు ధృఢమైన నిర్ణయాలు తీసుకుని సమాజంలో ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కోవచ్చని పారా సంస్థ కో-ఆర్డినేటర్ టి. రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పారా సంస్థ ఆధ్వర్యంలో బాలలకు నాయకత్వ లక్షణాలు, లింగ సమానత్వం అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమాజంలోని సమస్యల్ని గుర్తించి, వాటిని ఏ విధంగా అధిగమించాలన్న దానిపై వివరించారు. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఎం. ఆనంద్ మాట్లాడుతూ బాలల న్యాయ హక్కు, బాలల పరిరక్షణ చట్టాలు, బాలల హక్కుల కోసం ప్రభుత్వం అనుమతితో పనిచేసే సంస్థల వివరాల్ని వెల్లడించారు. కార్యక్రమంలో పారా సంస్థ సభ్యులు తురకా మంగయ్య, ఆసిఫన్, మ్యాంటీ, వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల్లోని పాఠశాల మానవ హక్కుల క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ అర్చక సంఘాల ఆందోళన

గుంటూరు రూరల్: గోరంట్లలో ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం నాయకులు, అర్చకులు శనివారం ఆందోళన నిర్వహించారు. గోరంట్లలోని శ్రీ పద్మావతి అండాలు సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు సాయిచరణ్‌పై ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది దాడి చేసి, దుర్భాషలాడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని నేతలు ఆరోపించారు. దాడిచేసిన కమిటీ సభ్యుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని నేతలకు నచ్చజెప్పారు. బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించుకున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడటం నేరం



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ జి. స్పందన

గుంటూరు రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, దాని ద్వారా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్) జి. స్పందన సూచించారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'ఇల్ ఎఫెక్ట్స్ ఆఫ్ ర్యాగింగ్'పై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ర్యాగింగ్ అనేది పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన ఆటవిక చర్యగా పేర్కొన్నారు. తోటి విద్యార్థుల్ని ఆటపట్టించే క్రమంలో అనేక మంది చదువుల్ని అర్ధంతరంగా మధ్యలో ఆపడమే కాకుండా, ప్రాణాలు కోల్పోవడానికి కారణమవుతుందని చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్‌కి పాల్పడితే వెంటనే కేసును నమోదు చేసి శిక్షను అమలు చేస్తామని తెలిపారు. ప్యానల్ అడ్వకేట్ కె. కాశిదాస్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి దుష్ప్రభావాలకు లోనవ్వకుండా లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని చెప్పారు. తల్లిదండ్రుల పరువు, ప్రతిష్టలను కాపాడే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం పాల్గొంది.

సీఎం జగన్ మేలును ఆర్టీసీ ఉద్యోగులు మరువరు

- జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. రవికాంత్
- పొన్నూరులో ఆధునీకరించిన బస్ డిపో ప్రారంభం

పొన్నూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగుల్ని చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఆర్టీసీ ఉద్యోగులు మరువలేరని గుంటూరు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎం. రవికాంత్ తెలిపారు. పొన్నూరు పట్టణంలో రూ. 35 లక్షలతో ఆధునీకరించిన బస్ డిపోను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రోశయ్యకు ఆర్టీసీ ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు డీపీటీవో అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ 25 సంవత్సరాల ఇండస్ట్రీగా గొప్పలు చెప్పుకునే నరేంద్ర పొన్నూరు అభివృద్ధిని గాలికి వదిలేసి, తన ఆర్థిక అభివృద్ధి కోసం సంగం డెయిరీని సొంతం చేసుకున్నాడని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, పొన్నూరు నియోజకవర్గం రూపురేఖలు మార్చిన పరిస్థితిని ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు. పుట్టిన ఊరికే ఏమీ చేయలేని నరేంద్ర రాజకీయంగా తన ఉనికి కోసం తిప్పలు పడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తూ, నేడు ప్రతి కుటుంబంతో మమేకమై ఉన్నారని తెలిపారు. డీపీటీవో రవికాంత్ మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన మేలుతో కరోనా కష్ట కాలంలోనూ ఆర్టీసీ ఉద్యోగులు ట్రెజరీ ద్వారా జీతాలు తీసుకున్నారని తెలిపారు. ఆయనకు ఉద్యోగులు ఎల్లపుడూ రుణపడి ఉంటారని చెప్పారు. డిపోలో 40 బస్సులు ప్రతిరోజు 15 వేల కిలోమీటర్లు తిరుగుతూ, 15 వేల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని వివరించారు. 232 మంది ఉద్యోగులు పని చేస్తూ రోజుకు రూ. 6 లక్షల ఆదాయం సమకూరుస్తున్నారని చెప్పారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రోశయ్యను ఉద్యోగులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మైనార్టీ కార్పొరేషన్ మెంబర్ షేక్ సైపుల్లా, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, డిపో డీఎం అజిత కుమారి, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2023 కన్వీనర్ మార్గదర్శకాల ప్రకారం డిప్లొమాలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాల్లో నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాలలో మీన్ స్టేక్‌పై శుక్ర, శనివారాల్లో 36 గంటల పాటు హ్యాకథాన్‌ను నిర్వహించారు. 180 మంది విద్యార్థినీ, విద్యార్థులు వ్యవసాయం, రవాణా, ఆరోగ్యం, పర్యావరణం, సైబర్ సెక్యూరిటీ అంశాలపై పలు ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. జ్యూరీ మెంబర్లుగా హైదరాబాద్ ఇన్ఫోసిస్ లిమిటెడ్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ సుంకవల్లి అచ్యుత రాజేష్, వండర్ లైఫ్ ట్రావెల్ సీఈవో, కో- ఫౌండర్ సీహెచ్. పెంచల తరుణ్, బిడ్ అలర్ట్ ఫౌండర్ కె. అజయ్‌కుమార్, హ్యాపీ పే సీఈవో, ఫౌండర్ కసిరెడ్డి దేవీకిరణ్ వ్యవహరించారు. ఐదు ఉత్తమ ఆవిష్కరణల్ని ఎంపిక చేసి బహుమతుల్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సుబ్బారావు, సెక్రటరీ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే ప్రొడక్ట్స్‌గా అభివృద్ధి చేసేందుకు కావలసిన ఆర్థిక సాయంతో పాటు వసతుల్ని సమకూర్చనున్నట్లు ప్రకటించారు.